



సోమవారం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో చర్చిలను అందంగా అలంకరించారు. ప్రార్థనా మందిరాల ఎదుట గుడిసె వేసి క్రీస్తు జననాన్ని సూచించే నక్షత్ర ఆకారపు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

న్యూస్‌రీల్

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



సమీక్షలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. సమావేశంలో ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు నిర్వహించాలని పేర్కొన్నట్లు సమాచారం.

కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈనెల 28న భారత జాతీయ కాంగ్రెస్ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, ఆవిర్భావ వేడుకల కమిటీ సభ్యుడు కూచాడి శ్రీహరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకలకు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి రెండు వేల మంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో జరిగే ర్యాలీలో కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు హాజరవుతారని తెలిపారు. వేడుకలకు జిల్లాలోని అన్ని స్థాయిల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ

ముధోల్: మండల కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ పార్థసారధి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం భైంసాలోని పులేనగర్ సరస్వతీ శిశుమందిర్‌లో జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. గుండు విసురుటలో కోరి మనోజ్ఞ ప్రథమస్థానం, బాలుర ఖోఖో టీం ద్వితీయ స్థానంలో నిలిచి విభాగ్‌స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 6, 7 తేదీల్లో విభాగ్‌స్థాయి ఖేల్‌ఖూద్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని ప్రబంధకారిణి సభ్యులు, ఆచార్యులు అభినందించారు.


మెరుగైన వైద్యసేవలందిస్తాం



రోగులతో మాట్లాడుతున్న రామారావుపటేల్

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఏరియాస్పత్రిలో డయాలిసిస్ కేంద్రం, మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కిడ్నీ సంబంధ బాధితులకు స్థానికంగానే డయాలిసిస్ సేవలు అందించేందుకు ఐదు పడకలతోపాటు ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిపుణులైన సిబ్బందితో డయాలిసిస్ సేవలు అందించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీ నాథ్ పేర్కొన్నారు. ఆయన వెంట డాక్టర్ దామోదర్‌రెడ్డి, నాయకులు గంగాధర్, భీంరావు, రమేశ్, పండిత్‌రావు, రవిపాండే, గోపాల్‌సర్డా, సాయినాథ్, శ్రీనివాస్, మల్లేశ్వర్, ఆనంద్‌రావు పటేల్, శంకర్‌చంద్రే ఉన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఖానాపూర్‌వాసి





శివకృష్ణ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన సీ శివకృష్ణ పెద్దపల్లి జిల్లా ధర్మారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీజీటీ జంతుశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. దేశంలో అత్యంత ఘనంగా జరిగే 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్-2023)'లో నిర్వహించే 'నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్‌షాప్'నకు ఎంపికయ్యారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో జనవరి 17 నుంచి 20వ తేదీ వరకు ఫెస్టివల్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, సీఎస్ఐఆర్, ఇతర పరిశోధనల సంస్థలు పాల్గొననున్నాయి. విద్యార్థులకు వినూత్నంగా బోధించడం, బోధనోపకరణాలు తయారు చేయడం, విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లిస్తూ వివిధ పోటీల్లో ఎంపికయ్యేలా తయారు చేసినందుకు శివకృష్ణ ఎంపికయ్యారు.

ఆరోగ్యమస్తు

- జిల్లాలో 14 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ
- 1,672 రకాల వ్యాధులకు చికిత్స
- ఉచితంగా మందుల పంపిణీ
- వైద్యఖర్చులు రూ.10లక్షలకు పెంపు
- పేదల ఆరోగ్యానికి సర్కారు భరోసా





నిర్మల్‌చైన్‌గేట్: పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి చికిత్స పొందాలంటే ఆర్థికస్థితి కారణంగా అన్ని విధాలా ఆలోచించేవారు. వీరికి మేలు చేసేలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ఆయన ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ప్రజలు ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించారు. రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరినీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. జిల్లాలో సుమారు 2,08,797 ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. వీటిలో 6,44,796 మంది సభ్యులుగా ఉన్నారు. గతంలో తెల్లరేషన్ కార్డుదారులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆహార భద్రత కార్డులు జారీ చేయగా.. వాటి లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం వీటి స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నారు.

రూ.10లక్షల వరకు పెంపు

ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించినప్పుడు అప్పటి సర్కారు రూ.2లక్షల వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ పథకాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఆరోగ్యశ్రీ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ రెండు పథకాలకు కలిపి రూ.5లక్షల వరకు వైద్యసేవలు పొందే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మేనిఫెస్టోలో తెలిపినట్లుగా ఆరోగ్యశ్రీ పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంగా మార్చుతూ పరిధిని రూ.10 లక్షలకు పెంచుతూ ఈ నెల 9న ప్రారంభించింది. 289 వ్యాధులు, సర్జికల్ విభాగంలో 1,383 వ్యాధులకు రూ.10 లక్షల వరకు ఈ పథకం కింద చికిత్స పొందవచ్చు. 126 రకాల వ్యాధిగ్రస్తులకు చికిత్స అనంతరం ఏడాదిపాటు పాటు ఉచితంగా మందులు అందిస్తారు.

పలు విభాగాల్లో వైద్యం..

పీహెచ్‌సీలో జనరల్ సర్జన్, గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్ సర్జరీ, నెఫ్రా, అర్థోపెడిక్ సర్జరీ, ప్రొసీడ్యూర్స్, పిడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యంతో వచ్చే నిధుల్లో 30 శాతం ఆస్పత్రి అభివృద్ధికి మిగతా మొత్తాన్ని వైద్యం చేసిన వైద్యులు, సిబ్బందికి ఇతర ఖర్చులకు వాడుతున్నారు.

పీహెచ్‌సీల్లో ఆయుష్మాన్ భారత్

జిల్లాలోని 18 పీహెచ్‌సీలతోపాటు మూడు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభమయ్యాయి. అర్బన్ హెల్త్ సెంటర్లతోపాటు పీహెచ్‌సీల్లో ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జాన్ ఆరోగ్య యోజన -ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స కోసం కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు విడుదల చేస్తోంది. ఈ పథకంలో ప్రతిరోజూ రూ.2,100 చొప్పున ప్రతీ కేసుకు రూ.10,500 మంజూరవుతాయి. వీటిలో 65 శాతం నిధులు ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, 35 శాతం నిధులు సిబ్బందికి ప్రోత్సాహకంగా ఇస్తారు. పీహెచ్‌సీల్లో మొత్తం 58 రకాల చికిత్స ఆరోగ్యశ్రీ పథకంలో అందించడానికి జాబితా రూపొందించారు. ఈ పథకం కింద బాధితులకు రూ.5లక్షల వరకు చికిత్స అందించడానికి వీలవుతుంది. వీటిలో కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు భరిస్తోంది.

జిల్లాలోని 14 ఆస్పత్రుల్లో..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఆరు ప్రభుత్వ, ఎనిమిది ప్రైవేట్ దవాఖాన్లలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి. నిర్మల్‌లో రెండు ప్రభుత్వ, ఆరు ప్రైవేట్, ఖానాపూర్‌లో రెండు ప్రభుత్వ, భైంసాలో రెండు ప్రభుత్వ, రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆస్పత్రుల పరిధిలో జనవరి 2023 నుంచి నవంబర్ 2023 వరకు 5,700 కేసులు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం దాదాపు రూ.95 కోట్లు ఖర్చు చేసింది.

నిరుపేదలకు ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పరిమితిని పెంచడంతో నిరుపేదలకు మేలు జరగనుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యఖర్చులను రూ.5లక్షల నుంచి రూ.10లక్షల పెంచడం పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అర్హులు జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంది.

– సునీల్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

సద్వినియోగం చేసుకోవాలి



ఆహార భద్రతకార్డున్న ప్రతి ఒక్కరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుంది. ఇటీవలే ప్రభుత్వం వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. పెంపును ఈ నెల 9వ తేదీ నుంచి అమలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– భూమారెడ్డి, ఆరోగ్యశ్రీ టీం లీడర్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి సీతక్క



మంత్రి సీతక్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు చేశారు. ఇన్‌చార్జి మంత్రిగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పథకాలు, పాలన తీరుపై సమీక్షలు, సమావేశాల నిర్వహణ, ప్రజాపాలనపై పర్యవేక్షణ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగే ప్రభుత్వ వ్యవహారాలన్నీ సమన్వయం చేస్తారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆమె ఇన్‌చార్జి మంత్రిగా రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఎస్టీ రిజర్వు కావడంతో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ములుగు ఎమ్మెల్యే సీతక్కను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వ్యవహరించారు.

27న ఈపీఎఫ్ శిబిరాలు

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈనెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారుల సమావేశాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సమావేశాలను ఆయా జిల్లాల పరిధిలో ఉన్న పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచిర్యాలలో మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో, నిర్మల్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ శిబిరంలో ఈసీఆర్, ఇతర రాబడులు, కేవైసీ సీడింగ్, సభ్యుల వివరాల దిద్దుబాటు, అప్‌డేట్, ప్రధాన యజమానులు, కాంట్రాక్టర్లు, యూఏఎన్ జనరేషన్, యాక్టివేషన్ వంటి సేవలు అందిస్తామని తెలిపారు.

గురుకులం.. సమస్యల నిలయం



రాచాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల

గ్రౌండ్ రిపోర్ట్

- అద్దె భవనంలో రాచాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం
- సమస్యలతో విద్యార్థులు సతమతం
- అరకొర వసతులు.. అన్నీ అవస్థలే
- చలికాలంలోనూ చన్నీటి స్నానమే..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. ఇక్కడ సరైన భవనం లేక ఏడాదిపాటు వడ్యాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 2020లో ఈ పాఠశాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల భవనంలోకి మార్చారు. అద్దె భవనం కావడంతో ఇక్కడ విద్యార్థులకు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలను ఆదివారం 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగు చూశాయి.

విద్యార్థులే వంట మనుషులుగా..

ఈ గురుకులంలో ఆదివారం ఉదయం విద్యార్థులే పిండి పిసుకుతూ పూరీలు తయారు చేస్తే కనిపించారు. మరికొందరు ఎముకలు కొరికే చలిలోనే చల్లటి నీటితోనే స్నానం చేస్తున్నారు. దీనిపై వెంటనే ప్రిన్సిపాల్ సంతోష్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. వంట సిబ్బంది సరిపడా లేనందునే విద్యార్థులతో వంట పనులు చేయించాల్సి వస్తోందని తెలిపారు. ఇది గురుకుల విద్యాలయాల్లో సర్వసాధారణమేనని చెప్పడం గమనార్హం.

676 మంది విద్యార్థులు ఇక్కడే..

ఈ గురుకుల విద్యాలయంలో 5నుంచి 10వ తరగతి వరకు 459 మంది ఉన్నారు. ఈ పాఠశాల కళాశాలగా అప్‌గ్రేడ్ కాగా, ఇదే అద్దె భవనంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు భైంసా మండలం జామ్‌గామ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర జూనియర్ కళాశాల కూడా ఇందులోనే కొనసాగుతోంది. దీంతో ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరంలో 107, రెండో సంవత్సరంలో 110 మంది విద్యార్థులు చదువుతున్నారు. 676 మంది విద్యార్థులు ఒకే భవనంలో ఉంటున్నారు. సరైన వసతులు లేక సమస్యల మధ్య చదువు కొనసాగిస్తున్నారు.

అరకొర వసతులతో అవస్థలు..

అద్దె భవనంలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. వసతి సరిగా లేక తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. ఒక్కో గదిలో 40 నుంచి 60 మంది పడుకుంటున్నారు. పైగా ఆ గదులు విరిగిన తలుపులు, తలుపులు లేని కిటికీలతో ఉన్నాయి. రాత్రివేళ చలి భరించలేకపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు. స్నానాలు చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరిపడా స్నానాల గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఉన్నవి పూర్తిగా అపరిశుభ్రంగా, అసౌకర్యంగా, తలుపులు లేకుండా ఉన్నాయి. విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే విద్యాలయాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పూరీలు తయారు చేస్తున్న విద్యార్థులు



ఆరుబయట చన్నీటి స్నానం చేస్తున్న విద్యార్థులు



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు



మాకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఉన్నవి కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. దీంతో అందులోకి వెళ్లలేక పోతున్నాం. నిత్యం అవస్థల మధ్య చదువులు కొనసాగిస్తున్నాం. – రాము, విద్యార్థి

అధికారులకు విన్నవించాం

రాచాపూర్ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. ఇక్కడి సమస్యల గురించి ఇదివరకే మా సొసైటీ అధికారులకు విన్నవించాం. నిర్మల్‌లో సరైన భవనం లభించడం లేదు. లభిస్తే ఇక్కడ నుంచి మార్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – సంతోష్, ప్రిన్సిపాల్

రోజూ చన్నీటి స్నానమే..



పాఠశాలలో వేడినీటి సౌకర్యం లేదు. చలికాలంలో నూ రోజూ చన్నీటి స్నానమే చేస్తున్నాం. అధికారులు పాఠశాలను సందర్శించాలి. మా ఇబ్బందులు తొలగించాలి.

– సాయితేజ, విద్యార్థి

సౌకర్యాలు కల్పించాలి



గురుకులం నిర్వహిస్తున్న అద్దె భవనంలో వసతులు సరిగా లేవు. నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. మౌలిక వసతులు కల్పించాలి.

– ప్రణయ్‌కుమార్, విద్యార్థి

కిటికీలు, తలుపులు లేవు



మేము నిద్రించే గదులకు తలుపులు లేవు. కిటికీలకు కూడా తలుపులు లేవు. రాత్రివేళ చలి తీవ్రతకు నిద్రపట్టడంలేదు. అధికారులు వెంటనే స్పందించాలి. తలుపులు ఏర్పాటు చేయాలి.

– మనోజ్, విద్యార్థి

ఘనంగా దత్త జయంతి వేడుకలు



బాబా వేషధారణలో భక్తుడు లక్ష్మణ్



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- నేటితో ముగియనున్న మహా సాయిపారాయణం
- మొదలైన అఖండ సాయినామస్మరణ
- 48గంటల పాటు కార్యక్రమం
- 26న ప్రత్యేక పూజలు, అన్నదానం


నిర్మల్ ఖిల్లా: జిల్లాకేంద్రం శివారులోని గండి రామన్న క్షేత్రంలో దత్త జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. తొలిరోజు ఆదివారం అఖండ సాయినామ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 26న దత్త జయంతిని పురస్కరించుకుని ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని చించాల, కామోల్, ఎడ్‌బిడ్, వెంకటాపూర్ తదితర గ్రామాలకు చెందిన దాదాపు 60 మంది భజనకారులు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వీరు సాయిబాబా ఆలయంలో 48 గంటల పాటు నిరంతరాయంగా సాయినామాన్ని జపించనున్నారు. అంతకుముందు ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాపారాయణ కార్యక్రమం సోమవారం ఉదయం ముగుస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9గంటలకు నిర్మల్ పట్టణంలోని పురవీధుల గుండా సాయి రథాన్ని ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. చివరి రోజైన మంగళవారం దత్త జయంతిని పురస్కరించుకుని ఉదయం 6గంటలకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు అఖండ సాయినామం ముగుస్తుందని తెలిపారు. మధ్యాహ్న హారతి అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని సాయికృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమాల్లో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు పూదరి నరహరి, కందుల పండరి, జొన్నల మనోహర్, రామ్‌రెడ్డి, హరి, ఉప్పుల నందు, సోమేశ్, కోల శంకర్, దశగౌడ్, ప్రకాశ్, శ్రీను, రామచందర్, జిందం గోవర్ధన్, రేఖ, రేణుక దాస్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుభీర్‌లో అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయసమ్మేళనం పేరిట ఇదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 23 ఏళ్ల క్రితం పాఠశాల నుంచి విడిపోయి వివిధ ప్రాంతాలు, వృత్తుల్లో స్థిరపడ్డవారంతా ఒక్కచోట చేరారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సరదాగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయమందించారు. అప్పటి ఉపాధ్యాయులు నాగమణి, లింగన్న, ప్రేమ్‌సాగర్, రమేశ్, మహేశ్వర్‌రావు, ఎర్రన్న, పూర్వ విద్యార్థులు నరేందర్, మహేశ్, శ్రీనాథ్, వైద్యనాథ్, సురేశ్ తదితరులున్నారు.


నిర్మల్‌లోని క్యాథలిక్ చర్చి


నిర్మల్‌లో ముస్తాబైన చర్చి

ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం



నిర్మల్ జిల్లా కేంద్రంలో...



సోన్ మండలంలోని మాధాపూర్ చర్చిలో ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే దృశ్యాలు





ముస్తాబైన చర్చీలు

నిర్మల్‌టౌన్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని చర్చీలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. క్రీస్తు జననాన్ని సూచించే నక్షత్రపు గుర్తులు కలిగిన రంగురంగుల అలంకరణలను క్రైస్తవులు తమ ఇళ్లపై అలంకరించారు. స్థానిక గాజులపేటలోని సీఎస్ఐ చర్చి 1930లో బ్రిటిష్ హయాంలో నిర్మించారు. ఈ చర్చి మెదక్‌లోని చర్చికి అనుబంధం. కాగా ఇక్కడికి ఉమ్మడి జిల్లా నుంచి క్రైస్తవులు వస్తుంటారు. దీంతోపాటు వెంకటాపూర్‌లోని మీస్సి చర్చి మూడేళ్ల క్రితం నిర్మించారు. ఈ చర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అతిపెద్దది. వీటితోపాటు కొండాపూర్ బ్రిడ్జి వద్ద గల సెయింట్ థామస్ చర్చిని సైతం విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం అర్ధరాత్రి దాటే వరకూ వివిధ చర్చల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకలు నిర్వహించుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు.


నిర్మల్ జిల్లా కేంద్రంలో...


నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్‌నగర్‌లో విద్యుత్ దీపాలతో పశువుల పాకలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో..


కడెం: పెద్దబెల్లాల్ సెయింట్ ఆంటోనీస్ చర్చి


ఇచ్చోడ: ఇచ్చోడలో క్రీస్తురాజు దేవాలయం


ఖానాపూర్‌లో..

క్లుప్తంగా

నాగ్‌నాథ్ శివాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే


కుటుంబీకులతో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహూంద నాగ్‌నాథ్ శివాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో శనివారం రాత్రి చొరబడి ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసి టీవీని ఎత్తుకెళ్లారు. గమనించిన స్థానికులు ఇంటి యజమానికి తెలియజేయడంతో చోరీ జరిగిన విషయం తెలిసింది. బాధితుడు శివకుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విదేశాల నుంచి నెల రోజుల సెలవు నిమిత్తం వచ్చాడు. ఇక్కడ నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో గత బుధవారం గృహప్రవేశం చేశాడు. మూడవ రోజునే గుండెపోటుతో కుప్పకూలాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు..

జిల్లా కేంద్రానికి చెందిన ఓ న్యాయవాది తరచూ తనకున్న పరిచయాలమూలంగా మిత్రులతో అప్పుడప్పుడు విందుల్లో పాల్గొనడం, మద్యం సేవిస్తుండడం చేస్తుండేవాడు. ఆహారపు అలవాట్లు కూడా ప్రణాళికాబద్ధంగా ఉండకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వైద్యులను సంప్రదించగా అప్పటికే కాలేయం దెబ్బతిందని తెలిపారు. ఈ పరిణామంతో మానసికంగానూ కృశించిపోయాడు. గత పక్షంరోజుల క్రితం మృతిచెందాడు.

సారంగాపూర్ మండలంలోని చించోలి -బి గ్రామానికి చెందిన సుమారు 45 ఏళ్ల వ్యక్తి గల్ఫ్‌లో పనిచేస్తూ తిరిగి వచ్చాడు. ఒక రోజు ఒంట్లో జ్వరంగా ఉండి దగ్గుతుండగా ఆకస్మికంగా రక్తం బయటకు వచ్చింది. దీంతో పరీక్షలు చేయించుకున్న ఆ వ్యక్తి అప్పటికే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయిందని, కాలేయం, పాంక్రియా తదితర భాగాలు మద్యపానం సేవించడంతో దెబ్బతిన్నాయని వైద్యులు తెలుపడంతో నీరసించిపోయాడు. అప్పటి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వారం రోజుల్లో మృతిచెందాడు.

ఊపిరి ఆగుతోంది..!

- పెరుగుతున్న హృద్రోగ, కాలేయ సమస్యలు
- జిల్లాలో తరచుగా ఆకస్మిక మరణాలు
- నాలుగుపదుల వయసువారే అధికం
- అసమతుల్య ఆహారపు అలవాట్లు, జీవనశైలే కారణం
- క్రమబద్ధమైన నియమాలు పాటించాలంటున్న ఆరోగ్యనిపుణులు


ఉదయం వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు తరచుగా మృతి చెందుతూ ఉండడం ఆందోళనలకు గురిచేస్తోంది. ప్రణాళిక లేని ఆహారపు అలవాట్లు, మద్యపానం, సరైన వ్యాయామం లేకపోవడం, క్రిమిసంహారక మందులతో పండించిన కూరగాయలు, దినుసులు వంటివాడకం మితిమీరిపోవడంతోనే ఇలాంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఎన్నో కారణాలు...

ప్రధానంగా గుండె లయతప్పడానికి ఎన్నో అంశాలు ప్రభావం చూపుతాయి. కొన్నిసార్లు పెద్దగా కారణాలేవి లేకుండానే ఇటువంటి ప్రమాదం సంభవిస్తుంది. కొందరిలో మాత్రం గుండె కండరం మందం కావడం, పుట్టుకతో గుండెలో ఉండే లోపాలు, కర్ణికలు పెద్దగా ఉండడం, జన్యుపరంగా తలెత్తే ఇతర ఇతర సమస్యలు రక్తంలో ఖనిజలవణాల సమతుల్యత లోపించడం, మానసిక ఒత్తిడి నిద్రలేమి వంటివి కారణమవున్నాయి. బాగున్న కండరం మధ్యభాగంలోని కణాలు అతి చురుకుగా స్పందించడంతో కూడా గుండె కొట్టుకునే వేగం పెరుగుతోంది. దీంతో శరీరానికి రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, ఫలితంగా తలతిరగడం, స్పృహ తప్పి కోల్పోవడం, నిమిషాల వ్యవధిలోని మరణం సంభవించడం వంటి వాటికి ఆస్కారం ఉంటుంది.

జీవనశైలిలో మార్పుతోనే నివారణ...

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు అనేక ఒత్తిడిలతో కూడిన జీవన విధానంలో ప్రశాంతత లోపించడం సమయభావంతో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఉదయం నడక, వ్యాయామక కసరత్తులు, యోగా, మెడిటేషన్ వంటివి నిపుణుల పర్యవేక్షణలో చేయడంతో ఆరోగ్యంగా ఉండగలుగుతాము. కాలేయ సంబంధ వ్యాధుల్లో ప్రధానంగా ఆహారపు అలవాట్లు ప్రభావం చూపుతాయి. సరైన ఆహారపు అలవాట్లు లేని వ్యక్తుల్లో సమస్యలు తలెత్తడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

శరీరాన్ని సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి



ఈ రోజుల్లో ఎటువంటి ఆరోగ్య సమస్య ఎటువైపు నుంచి మంచికొస్తుందో తెలియనిస్థితిలో ఉన్నాం. ఆరో గ్యపరంగా శరీరాన్ని సమతుల్య స్థితిలో ఉంచుకునే విధంగా నియమాలు పాటించాలి. ఆహారం పరంగా, శారీరకంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎండపెల్లి అశోక్‌కుమార్, మైథిలీ వెల్‌నెస్ సెంటర్, నిర్మల్

నిరంతర పరీక్షలతోనే నివారణ



గుండె సంబంధిత జబ్బులు ప్రస్తుత కాలంలో అధికమవుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసులవారు గుండె, కాలేయ సంబంధ సమస్యలకు గురవుతున్నారు. గుండె జబ్బులు ఇతర అనారోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరీక్షలను చేయించుకోవాలి.

– డాక్టర్ ఎం.ఎస్. ఆదిత్య, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్

ఆర్మీ జవాన్ ఆత్మహత్య


గడ్ చందా రమేష్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. దీంతో కాలనీలో విషాదం నెలకొంది. పట్టణ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.. స్థానిక వెంకటాపూర్ కాలనీకి చెందిన గడ్ చందా రమేష్ (28) ఆర్మీ జవాన్. కోల్‌కత్తా బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ 15న తన బామ్మర్ది వివాహం నాగంపేట్ ముప్కల్ మండలంలో ఉండడంతో వచ్చాడు. వేడుకలు ముగించుకొని ఆదివారం ఉదయం తన ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ప్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో ఇంట్లో వారు చూసేసరికి ప్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అక్కడికి చేరుకున్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ శివారులో శ్రీరాముల రమణయ్య (54) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భైంసా పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన శ్రీరాముల రమణయ్య గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గత రెండు రోజుల క్రితం నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. హజ్గుల్ గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

'కూచిపూడి గిన్నిస్‌రికార్డు'లో ఖానాపూర్ చిన్నారులు

ఖానాపూర్: తెలుగువారి సాంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ఆదివారం భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించారు. ఈ క్రమంలో 8వేల మంది కూచిపూడి కళాకారులంతా ఏకమై అరుదైన గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ కళాకారుల బృందంలో ఖానాపూర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు పాల్గొన్నారు. మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన సోని-శివరామకృష్ణ దంపతుల కూతురు శన్వికతో పాటు గోడలపంపు గ్రామానికి చెందిన శ్రవంతి-రాజ్‌కుమార్‌ల కూతురు వైశాలి, రాజూరా గ్రామానికి చెందిన ఉమా-రోహిదాస్‌ల కూతురు బార్గవి పాల్గొని నృత్యం చేశారు. అనంతరం చిన్నారులకు గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందించారని నాట్య గురువులు నవ్యవినయ్, అంజలితో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.


గిన్నిస్‌రికార్డ్ సర్టిఫికెట్


కూచిపూడి ప్రదర్శనలో చిన్నారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని విద్యార్థులు మళ్లీ అదే చోట 16ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఉపాధ్యాయుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. 2006-07లో పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.

